క్లుప్తంగా

మిరపకు సేంద్రియ జీవ ఎరువులు వాడుకోవాలి



పెదకాకాని: మిరప పైరుకు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ, జీవ ఎరువులు వాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి తెలిపారు. పెదకాకాని గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రైతులతో కలసి మిరప, మినుము పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ పి.సంధ్యారాణి మాట్లాడుతూ రైతులకు మినుము, మిరప పైర్లకు సమగ్ర సస్యరక్షణపై వివరించారు. చీడపీడలు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రబీ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంట బీమా పథకము ద్వారా రైతులు స్వచ్ఛందంగా నగదు చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు. రైతులు మొక్కజొన్న పైరు ఎకరానికి 114 రూపాయలు, జొన్న 48 రూపాయలు, మినుము 50 రూపాయలు, పెసర 45 రూపాయలు చెల్లించాలని ఏఓ తెలియజేశారు. సమీపంలోని కామన్ సర్వీస్‌సెంటర్‌కు వెళ్ళి స్పాట్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రెడ్డి శివాజీ, విఏఎలు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి




పొన్నూరు: మండలంలోని రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి సద్వినియోగం చేసుకోవాలని మండల ఏఓ డేగల వెంకట్రామయ్య తెలియజేశారు. మంగళవారం మండలంలోని దొప్పలపూడి, మన్నవ గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ధాన్యం 75 కేజీల బస్తా ఏ గ్రేడ్ రకం రూ. 1740, బి గ్రేడు రూ.1725 ధర అందిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం తేమ శాతం 17 కంటే తక్కువగా ఉండాలని, మిగిలిన నాణ్యత ప్రమాణాలను పాటిస్తే గోనె సంచులు, కూలీ, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. దాళ్వాకు పంటల బీమాకు ఈ నెల 15 వరకు ప్రీమియం చెల్లించి నమోదు తమ పంటలను చేసుకోవాలని తెలిపారు. గుంటూరు జిల్లా డాట్ సెంటర్ శాస్త్రవేత్త వెంకట రాములు పాల్గొని మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలలో యాజమాన్య పద్ధతులు వివరించారు. అనంతరం ఎఫ్ ఎం ఎస్ పథకం ద్వారా రైతులకు ఇచ్చే ఉచిత మినుము సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరి పంటను కట్టలుగా కట్టుకోవాలి

కాకుమాను: అధిక వర్షాల కారణంగా నేలకొరిగిన వరి పంటను పైకిలేపి కట్టలుగా కట్టుకోవాలని ఏవో కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని కాకుమాను, రేటూరు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ నేలవాలిన వరి దుబ్బులను కట్టలుగా కట్టి వాటిపై 200 లీటర్ల నీటిలో రెండు శాతం ఉప్పు ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలని ఆమె సూచించారు. ప్రతి రైతు సేవాకేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రైతులు ధాన్యాన్ని 17శాతం లోపు తేమ ఉండే విధంగా చూసుకోవాలన్నారు. సాధారణ రకం 75 కేజీల బస్తా రూ.2300లకు గాను రూ.1725లు ఇస్తుందని ఆమె తెలిపారు. గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2320లు మద్దతు ధర ఇస్తున్నట్లు ఏవో తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మడకా కృష్ణ చెన్నకేశవరావు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్ పీ.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. "ఇన్వెస్టిగేషన్స్ ఆన్ కాంపాక్ట్ సీపీడబ్ల్యూ ఫెడ్ సర్క్యులర్లీ పోలరైజ్డ్ వైడ్ అండ్ డ్యూయల్ బ్యాండ్ యాంటీనాస్ ఫర్ 5జీ, వైర్‌లెస్ ల్యాన్ అండ్ శాటిలైట్ అప్లికేషన్స్" అనే అంశంపై మడకా కృష్ణ పరిశోధన చేశారని తెలిపారు. ఈయనకు విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఈసీఈ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పచియానన్ ముత్తుస్వామి గైడ్‌గా వ్యవహరించారన్నారు. తన పరిశోధనలో భాగంగా 2 ఎస్‌సీఐ, 4 స్కోపస్ పేపర్లు పబ్లిష్ చేశారని వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టా పొందిన మడకా కృష్ణ చెన్నకేశవరావును పలువురు అభినందించారు.

ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది



హాజరైన కార్యకర్తలు



మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

- అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదు
- పార్టీ పటిష్టత కోసం బాధ్యతగా పని చేయాలి
- కార్యకర్తల అభిప్రాయాల మేరకు నూతన కమిటీల నియామకం
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: నియోజకవర్గంలోని ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్తకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అక్రమంగా బనాయిస్తున్న కేసులకు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాజీ పొన్నూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఓట్ల కోసం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఐదు నెలల పాలనలోనే రాష్ట్ర ప్రజానీకం అనేక ఇబ్బందులు పడుతున్నారని, పెరిగిన విద్యుత్ చార్జీలు, నిత్యావసర ధరలతో ప్రభుత్వ పనితీరుపై ప్రజలు విసుగెత్తిపోయారని మండిపడ్డారు. ఇసుక అందుబాటులో లేక నిర్మాణాలు ఆగిపోయి, కార్మికులు జీవనోపాధి కరువై అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. సంక్షేమం రూపంలో తీసుకువచ్చిన మద్యం వీధి వీధికి చేర్చడంలో కూటమి ప్రభుత్వం సక్సెస్ అయిందని ధ్వజమెత్తారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. టీడీపీ నాయకుల కారణంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అక్రమ కేసులు ఎదుర్కొంటున్నారని, వారందరికీ పార్టీ ఎప్పుడూ తోడుగా ఉంటుందన్నారు. పార్టీని పటిష్ఠ పరిచేందుకు అందరం కలిసి పని చేద్దామని అన్నారు.

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి త్వరలోనే నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతారని తెలిపారు. సంక్రాంతికి పార్టీ నూతన కమిటీల నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పదవులు అలంకారంగా భావించే వారికోసం కాకుండా కార్యకర్తల అభిప్రాయం మేరకు పార్టీ అభివృద్ధి కోసం పని చేసే వారికి కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పొన్నూరు ఎంపీపీ భవనం పద్మలీల, జెడ్పీటీసీ కర్లపూడి రమేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు షేక్. మాము, షేక్. నాజర్, ఎందేటి వెంకట సుబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీకాతో జీవిత రక్ష

ప్రతి బుధ, శనివారాల్లో వైద్యశాలల్లో టీకా శిబిరాలు



చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

పొన్నూరు: వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన చిన్నారుల వరకూ ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు వేయిస్తే వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్యకరమైన జీవితం లభిస్తోంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సరైన అవగాహన లేక టీకాలు వేయించుకోవడం లేదు. దీంతో వివిధ రకాల వ్యాధులకు గురవుతూ పేదలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధినిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ప్రతి బుధ, శనివారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. అయితే అవగాహన రాహిత్యంతో పేదలు అనారోగ్య సమస్యలకు గురతున్నారు. మన్నవ పీహెచ్‌సీ పరిధిలోని 14 గ్రామాల్లో ప్రతి వారంలో బుధ, శనివారాల్లో తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

చిన్నారులు, గర్భిణులకు టీకాలు తప్పనిసరి



మన్నవ పీహెచ్‌సీ పరిధిలోని ప్రతి గ్రామంలో నెలకు 8 టీకా శిబిరాలు నిర్వహిస్తున్నాం. గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు బాధ్యతగా వేయించుకోవాలి. వీటివల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యశాలలో అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంత ప్రజలకు టీకాలపై అవగాహన కల్పిస్తున్నాం. సమయానుసారం టీకాలు వేయించడం వలన పిల్లలు సురక్షితంగా ఉంటారు.

– డాక్టర్ షేక్. మహమ్మద్ హుస్సేన్, మన్నవ పీహెచ్‌సీ

విద్యార్థులకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం



ఎంవోయూ కుదుర్చుకుంటున్న కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

ప్రత్తిపాడు: విద్యార్థులు తమ కోర్సు ముగించుకుని క్యాంపస్ నుండి బయటకు వెళ్లే సమయానికి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా ప్రత్తిపాడు మండలం యనమదలలోని కిట్స్ అక్షర్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ఐసీఐసిఐలో భాగస్వామ్యంగా వున్న ఐప్రాసెస్ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కళాశాలలో చైర్మన్ కోయి సుబ్బారావుకు కంపెనీ ప్రతినిధులు ఎంవోయూ పత్రాలు అందించారు. చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవితను దృష్టిలో ఉంచుకుని ఉపాధి కల్పనలో భాగంగా రానున్న రోజుల్లో మరిన్ని ఎంఎన్‌సి కంపెనీలతో ఒప్పందం చేసుకోనున్నామని చెప్పారు. ఎంవోయూ ప్రకారం ఐ ప్రాసెస్ కంపెనీ నిర్వహించే ప్రతి ప్రాంగణ ఎంపికల్లో మొదటి ప్రాధాన్యత కిట్స్ అక్షర్ విద్యార్థులకు ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. రామకోటయ్య మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్స్, సాఫ్ట్ స్కిల్స్‌పై పట్టుసాధించి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, డైరెక్టర్ గోగినేని సాంబశివరావు, టిపివో సాయికృష్ణా రెడ్డి, ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఘనంగా వ్యవసాయ విద్యా దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మిదేవి

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాంనందున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం వ్యవసాయ విద్యాదినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొన్న విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మిదేవి మాట్లాడుతూ భారతదేశ మొదటి రాష్ట్రపతి, మొదటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ బాబురాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలే వేసి నివాళులు అర్పించారు. సిక్స్త్ డీన్స్ కమిటీ సిఫారసులను అనుసరిస్తున్న విశ్వవిద్యాలయం ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం అని తెలిపారు. 60 శాతం ప్రాక్టికల్‌గా నైపుణ్యత పెంచే విధంగా ప్రమాణాలు ఉంటాయన్నారు. నాణ్యమైన వ్యవసాయాన్ని రైతులకు అందించేందుకు, నాణ్యమైన ఉత్పత్తులు సాధించేందుకు విదేశీ ఎగుమతులకు అనువైన వంగడాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి రైతుల అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ ఏవీ రమణ, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ బి.శ్రీలక్ష్మి, ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి, పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ, సీఓఈ డాక్టర్ డి.సంపత్‌కుమార్, లైబ్రరియన్ డాక్టర్ పీ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

దృఢ సంకల్పానికి వైకల్యం అడ్డురాదు

- ఎంఈవో రాయల సుబ్బారావు
- ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



చేబ్రోలులో చిన్నారులతో ఎంఈవో సుబ్బారావు, ఉపాధ్యాయులు



బహుమతులు అందజేస్తున్న నాబార్డ్ డైరెక్టర్ శరత్

చేబ్రోలు: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, దృఢ సంకల్పానికి వైకల్యం అడ్డురాదని చేబ్రోలు మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలు కొత్తపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రం వద్ద అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సమగ్ర శిక్షాభియాన్ వారి ఉత్తర్వుల ప్రకారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా మండల పరిధిలోని దివ్యాంగ పిల్లలకు వివిధ అంశాల్లో ఆటల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ బాల బాలికలకు బహుమతులను అందజేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు భవిత కేంద్రంలో అందిస్తున్న ఫీజియోథెరపీ, ప్రత్యేక విద్య, స్పీచ్ థెరపీ తదితర సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రాయల సుబ్బారావు సూచించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మంజు ప్రణతి, శిరీష, మల్లీశ్వరి, చిన్నారులు, వారి తల్లిదండ్రులు, భవిత ఉపాధ్యాయులు రాజేష్, అనురాధ పాల్గొన్నారు.

పెదకాకానిలో...

పెదకాకాని: విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, విద్య, ఉద్యోగ అవకాశాలను వారు తప్పక సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనందరావు అన్నారు. పెదకాకాని లూథర్‌గిరి ఎంపీపీఎస్ పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ తరగతులను ఉపయోగించుకోవాలన్నారు. వారికి ఈ శిక్షణ ద్వారా ఎటువంటి వ్యాయామం, చికిత్స వంటి అంశాలపై సకాలంలో సరైన సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా వారికి ఆటల పోటీలు, డ్రాయింగ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు (ప్రత్యేక శిక్షణ నిర్వాహకులు) హేమలత, సీతామహలక్ష్మి, లైబ్రేరియన్ వేముల విజయ్ కుమార్, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. చిన్నారులకు బహుమతులు అందజేశారు.

జేఎమ్‌జేలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

గుంటూరు రూరల్: వైకల్యం మనిషి ఎదుగుదలకు అవరోధం కారాదని జిల్లా నాబార్డ్ డైరెక్టర్ శరత్ తెలిపారు. మంగళవారం నల్లపాడు గ్రామంలోని జేఎమ్‌జే సాంఘిక సేవా సంస్థలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమతమ జీవితాలను ఉన్నత స్థితికి చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. జేఎమ్‌జే సంస్థ డైరెక్టర్ రెవరెండ్ సిస్టర్ మేరికుమారి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు శుభాకాంక్షలు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు పలు రకాల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, జేఎమ్‌జే సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

ప్రత్తిపాడు: వైఫల్యాలను అధిగమించి దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంఈవో సీహెచ్. రమాదేవి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంను పురస్కరించుకుని నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవిత సెంటరులో మంగళవారం ఐఈఆర్టీలు రమణ, శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. దివ్యాంగులకు ఆటల పోటీలతో పాటు డ్యాన్స్ పోటీలు జరిపారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈవోలు సీహెచ్. రమాదేవి, జి. లీలారాణిలు విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో రమాదేవి మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల వివక్ష చూపకూడదన్నారు. దివ్యాంగులు ఎంతో మంది ఎన్నో రంగాల్లో అద్భుత విజయాలు సాధించారని గుర్తు చేశారు. లీలారాణి మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు స్పెషల్ ఎడ్యుకేషన్, స్పీచ్‌థెరపి, ఫిజియోథెరపి వంటి సేవలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో....

పొన్నూరు: దివ్యాంగులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని దివ్యాంగుల భవిష్యత్‌కు ఉపయోగపడే సంక్షేమ పథకాలను వివరించారు. నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బి.రామారావు, బి. విజయ కుమారి పాల్గొన్నారు.

కళ్లం కళాశాలలో స్కిల్ బిల్డ్ క్యాంప్



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని చౌడవరం గ్రామంలోగల కళ్లం ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఐబీఎమ్ సంస్థ స్కిల్ బిల్డ్ క్యాంపును నిర్వహించారు. గత ఆరు రోజులుగా జరుగుతున్న క్యాంప్ మంగళవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమాశంకరరెడ్డి మాట్లాడుతూ ఐబీఎం కంపెనీచే స్కిల్‌బిల్డ్‌టెక్ క్యాంపును ఎడ్యునెట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగిందన్నారు. 500 మందికి పైగా బీటెక్ 3 వ సంవత్సరం చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీయస్‌బీ రెడ్డి తెలిపారు. టెక్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు అనేక సాంకేతిక అంశాలపై శిక్షణతోపాటు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌పై ప్రాజెక్టులను నిర్వహించారన్నారు. ఐబీఎం కంపెనీ లెర్నింగ్ ప్లాట్ ఫామ్స్‌లను వివిధ సాంకేతిక కోర్సులను ఉచితంగా అందించారన్నారు. ఈ శిక్షణ క్యాంప్ ద్వారా ఉద్యోగ సంబంధిత సర్టిఫికెట్లను పొందవచ్చని కళాశాల డీన్ కెరీర్ గైడెన్స్ విభాగాధిపతి డాక్టర్ పీఎల్ మాధవరావు తెలిపారు. క్యాంప్‌లో సంస్థ సాంకేతిక శిక్షకుడు నరేంద్ర ఏలూరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షెడ్డు ఏం పాపం చేసింది?



గతంలో ఉన్న షెడ్డు



కూల్చేసిన షెడ్డు

ప్రభుత్వ స్థలంలో పంచాయతీ వాహనాలను నిలుపుకునే షెడ్డును మంగళవారం అధికారులు సిబ్బంది కూల్చేశారు. మండలంలోని తోకావారిపాలెం గ్రామ సర్పంచ్ దొడ్డా సామ్రాజ్యం తెలిపిన వివరాల ప్రకారం గత ఐదేళ్ళ క్రితం గ్రామంలోని బావి పక్కనే ఉన్న ఆరు గజాల ప్రభుత్వ స్థలంలో రేకుల షెడ్డును నిర్మించి అందులో పంచాయతీ పారిశుధ్య వాహనాలను వర్షానికి, ఎండకు తడిచి ఎండకుండా నిలుపుకునేవారమన్నారు. కానీ స్థానిక టీడీపీ నేతలు కావాలని అధికారుకలు ఫిర్యాదులు చేసి కూల్చేశారని తెలిపారు. గ్రామానికి చెందిన ఆస్తిని కావాలని కూల్చేయటం అన్యాయమని తెలిపారు. ప్రజలకు చెందిన ఆస్తిని కావాలని ధ్వంసం చేయటం ఈ ప్రభుత్వానికే చెందుతుందన్నారు. ప్రజాధనాన్ని ఈవిధంగా నాశనం చేయటం ఎంతవరకూ న్యాయమని అధికారులను ప్రశ్నిస్తున్నామన్నారు.

–గుంటూరు రూరల్

పెదకాకానిలో డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ జయంతి

పెదకాకాని: భారతదేశానికి మొట్టమొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ అని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొల్లిపర ఆనందరావు అన్నారు. పెదకాకాని గ్రంథాలయంలో మంగళవారం డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ 140 వ జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి లైబ్రేరియన్ వేముల విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఆనందరావు మాట్లాడుతూ దేశ సాతంత్రం కోసం న్యాయవాద వృత్తిని, ఉపాధ్యాయ వృత్తిని వదులుకున్న గొప్ప వ్యక్తి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ అన్నారు.

ఆయను 1952 నుంచి 1962 వరకు భారతదేశానికి మొదటి రాష్ట్రపతి గానూ (అధ్యక్షుడుగా) పనిచేశాడు. పాత్రికేయుడు, పండిట్ అయిన డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ 1918లో సెర్చ్‌లైట్ అనే ఆంగ్లపత్రికను, దేశ్ అనే హిందీ పత్రికను నడిపారన్నారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని కొనియాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని హేమలత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సానుభూతి కాదు సహకారం అందించాలి



విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్‌ను అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

కాకుమాను: ఆత్మస్థైర్యం,పట్టుదల ఉంటే అంగవైకల్యం అభివృద్ధికి అడ్డుకాదని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల పట్ల సానుభూతి కాకుండా వారిలో మనోధైర్యం నింపి వారు ఎంచుకున్న రంగాల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు, సమాజంలో ప్రతి ఒక్కరు వారిని ప్రోత్సహించాలని ఆయన తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు మంచి లక్ష్యాన్ని ఎంచుకుని ఆయా రంగాల్లో రాణించాలని ఆయన సూచించారు. హెలెన్ కెల్లర్, స్టీఫెన్ హకింగ్ వంటి వారిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో దేశం గర్వించే విధంగా పట్టుదలతో చదువుకోవాలని ఆయన తెలిపారు. ఎంఈవో-2 విజయ్ భాస్కర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్‌లున్నాయని తల్లిదండ్రులు తమ చిన్నారులను ఉన్నత చదువులు చదివించి వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలని ఆయన కోరారు. భవిత విద్యను విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు అధిరోహించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా చిన్నారులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుపులేటి శివకుమారి, ఉప సర్పంచ్ బోడపాటి శివప్రసాద్, నల్లమోతు పూర్ణచంద్రరావు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.సత్యం, ఉపాధ్యాయులు రమాదేవి, వెంకటదుర్గా మాధవి, దయమ్మ, రమాదేవి, తల్లి దండ్రులు, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

చేబ్రోలు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతకు విద్యార్థులకు వివిధ రకాల ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ కోర్సుల ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వటం జరుగుతుందని నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు మంగళవారం తెలిపారు. చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్‌లో అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సును ప్రారంభించటం జరుగుతుందని తెలిపారు. రెండు నెలల పాటు యువతకు నైపుణ్య శిక్షణ కల్పించి వారిని స్థానికంగా జిల్లాలో ఉన్న పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పించటం జరుగుతుందని కొండా సంజీవరావు తెలిపారు.

విద్యతోనే విజ్ఞానం అలవడుతుంది



మాట్లాడుతున్న ఐసీడీఎస్ గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ పి. మాధవి

ప్రత్తిపాడు: విద్యతోనే విజ్ఞానం, వివేకం అలవరుతాయని ఐసీడీఎస్ గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ పి. మాధవి అన్నారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పాతమల్లాయపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్య లేకపోవడం వలన కలిగే అనర్థాలు, విద్య వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ మాధవి మహిళలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. చదువు మధ్యలో ఆపివేసి బాల్యవివాహాలు చేయడం వలన శారీరకంగా, మానసికంగా సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ ఎం కె. వెంకట నారాయణ, అంగన్‌వాడీ కార్యకర్త వై. యమున పాల్గొన్నారు.